'భారీ రుణమాఫీ చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒక్కటే'


మాట్లాడుతున్న కోదండరెడ్డి

ఓల్డుబోయినపల్లి, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): భారీ రుణమాఫీ (రూ.2లక్షలు) చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒక్కటేనని తెలంగాణ వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. శుక్రవారం ఓల్డుబోయినపల్లి ఆర్ఆర్‌నగర్‌లో ఉన్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి నివాసంలో సమావేశమై ధరణి పోర్టల్, రుణమాఫీ, జిల్లా రైతులు ఎదుర్కుంటున్న సమస్యలపై రైతు సంఘాల నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడితేనే అభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర ఏర్పాటుకు పునాది వేసింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. బీఆర్ఎస్ నిర్వాకం వల్లనే రాష్ట్రంలో నిధుల కొరత ఏర్పడిందని ఆరోపించారు.

చెట్ల కొమ్మల తొలగింపు షురూ

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో గణేశ్ నిమజ్జనానికి అడ్డు లేకుండా రోడ్లకిరువైపులా చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమానికి అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఒక పక్క గణేశ్ నిమజ్జనాలు జరుగుతున్నా యూబీడీ అధికారులు చెట్ల కొమ్మలు తొలగించాలి అనే శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే గణనాథులకు అడ్డుగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం ప్రారంభించారు. నిమజ్జనానికి ఇబ్బంది లేకుండా అధికారులు మండపాల నిర్వాహకుల సూచనలు పరిగణలోకి తీసుకొని కొమ్మలను తొలగించాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కేపీహెచ్‌బీ డివిజన్ కన్వీనర్ రాజిరెడ్డి కోరారు.


గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నూతన, పాత కమిటీ సభ్యులు

జీడిమెట్ల పారిశ్రామికవాడ అభివృద్ధికి కృషి

జీడిమెట్ల, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జేఎన్ఎంబిఏ నూతన చైర్మన్ వీడీఎస్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం పాతకమిటీ నుంచి నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కమిటీ సభ్యులంతా ఏకతాటిపై నడిచి పారిశ్రామికవాడ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ సత్యనారాయణ, సిబ్బంది

స్వచ్ఛత పోస్టర్ ఆవిష్కరణ

దుండిగల్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపల్‌లోని స్వచ్ఛత ఈ సేవా- 2024 కార్యక్రమ పోస్టర్‌ను మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అధికారులతో కలిసి కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సునంద, ఈఈ సాత్విక్, అంజయ్య బాలచందర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, కొత్త కనెక్షన్ల జారీ నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ చర్చ్, గోల్ఫ్‌వ్యూ, ఇంటర్‌కాంటినెంటల్ ఫీడర్ల పరిధిలోని నానక్‌రాంగూడ, బౌల్డర్‌హిల్స్ అలేఖ్య టవర్స్, సుమధుర అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు. 11 కేవీ జయభేరి ఫీడర్ పరిధిలోని ఏపీహెచ్‌బీకాలనీలో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు, 11 కేవీ ఏపీహెచ్‌బీ కాలనీ ఫీడర్‌పరిధిలోని ఏపీహెచ్‌బీ కాలనీలో మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు, 11 కేవీ పీజేఆర్‌నగర్ ఫీడర్ పరిధిలోని టెలికం నగర్‌లో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు, ఖాజాగూడ ఫీడర్ పరిధిలోని ఖాజాగూడలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు, కొమురం భీం ఫీడర్‌పరిధిలో టీఎన్‌జీవోస్ కాలనీలో 10.30 నుంచి 11 గంటల వరకు, గౌలిదొడ్డి ఫీడర్ పరిధిలోని గౌలిదొడ్డిలో 11 నుంచి 11.30 వరకు, కాళోజీ ఫీడర్ పరిధిలోని టీఎన్‌జీవోస్ కాలనీలో 11.30 నుంచి 12 గంటల వరకు, జేవీకాలనీ ఫీడర్ పరిధిలోని జేవీకాలనీ, ప్రశాంత్‌హిల్స్‌లో మధ్యాహ్నం 1 నుంచి 1.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని పేర్కొన్నారు.

కేపీహెచ్‌బీ పరిధిలో..

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ సెక్షన్ పరిధిలో న్యూ సర్వీస్ కోసం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ విద్యాసాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మారెడ్డికాలనీ, ధనలక్ష్మీసెంటర్, నాలుగో ఫేజ్ మెయిన్‌రోడ్డు, డీమార్ట్, రోడ్డు నంబర్-1, ఎమ్మార్వో కార్యాలయం, తొమ్మిదో ఫేజ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి సా.4 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో గంట నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.


బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

బీజేపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

గాజులరామారం, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): గాజులరామారంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కార్పొరేటర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా ఇన్‌చార్జి గరిగ శేఖర్ కార్యకర్తలు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్‌నేత, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు కట్టకుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ట్రాఫిక్ డైవర్షన్

రాయదుర్గం, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): హైటెక్ సిటీ ఫ్లై ఓవర్ నుంచి యశోద ఆస్పత్రి వద్ద గల ఆర్వోబీ ఫ్లై ఓవర్ స్టార్టింగ్ పాయింట్ వరకు సర్వీసు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకూ రోడ్డు డైవర్షన్ ఉందని వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సైబర్ టవర్ వంద అడుగుల రోడ్డు జంక్షన్ నుంచి పర్వత్‌నగర్ మీదుగా మూసాపేట్ వైపు వెళ్లొచ్చు. బాచుపల్లి వెళ్లేవారు సైబర్‌టవర్ ఫ్లై ఓవర్ నుంచి కొత్తగూడ, మియాపూర్, హాఫీజ్‌పేట వెళ్లొచ్చు. సైబర్‌టవర్ నుంచి జేఎన్‌టీయూ మీదుగా వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు పర్వత్‌నగర్ జంక్షన్ నుంచి మూసాపేట్ కొత్తగూడ బ్రిడ్జి వైపు నుంచి వెళ్లవచ్చన్నారు. ఐకియా, సైబర్‌గేటు, సీఓడీ జంక్షన్ నుంచి జేఎన్‌టీయూకు వెళ్లేవారు సైబర్ ఫ్లై ఓవర్ నుంచి జేఎన్‌టీయూ వైపు వెళ్లొచ్చని పేర్కొన్నారు. సైబర్ టవర్ ఫ్లై ఓవర్ మీదుగా జేఎన్‌టీయూ వెళ్లేవారు ఎన్ గ్రాండ్ హోటల్ నుంచి ఎన్ కన్వెన్షన్ వెళ్లే రోడ్డును ఉపయోగించుకోవాలని కోరారు.

● సమస్యలు పరిష్కరించాలి



కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను నియోజకవర్గంలోని పలు బస్తీలకు, కాలనీలకు చెందిన ప్రజలు షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి తమ సమస్యలు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

- షాపూర్‌నగర్, ఆంధ్రజ్యోతి

గృహ నిర్బంధాలు


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి గేటు లోపల పోలీస్ బందోబస్తు

రాయదుర్గం, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): హుజరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే గాంధీ ఇల్లు ముట్టడికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ఎలాంటి గొడవలు జరుగకుండా ముందస్తుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, ఇతర ముఖ్య నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దీనిలో భాగంగా గచ్చిబౌలిలోని బౌల్డర్‌హిల్స్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎస్ఎల్ఎన్ స్ప్రింగ్‌వ్యాలీలో నివాసం ఉండే కొత్త ప్రభాకర్‌రెడ్డిని, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

● ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి పర్యవేక్షణలో గృహనిర్బంధం చేశారు. ఆయన నివాసం చుట్టుపక్కల భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలులోకి తీసుకొచ్చారు. శుక్రవారం కౌశిక్‌రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ఆరెకపూడి గాంధీ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరికలు చేసిన నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. పోలీసులు శంభీపూర్ రాజు ఇంటికి రాక ముందే కౌశిక్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, కార్యకర్తలు అందరూ శంభీపూర్ రాజు ఇంటికి రావాలని ఫోన్‌ల ద్వారా సమాచారం చేరవేశారు. అప్పటికే పోలీసులు శంభీపూర్ రాజు ఇంటిని చుట్టుముట్టి, రోడ్లన్నీ మూసేశారు.

● పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

బాలానగర్/ ఓల్డుబోయినపల్లి: ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఇంటికి బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పిలుపుతో పోలీసులు అప్రమత్తమయ్యారు శుక్రవారం ఉదయం నుంచే బీఆర్ఎస్ నేతలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్‌ను బోయినపల్లి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మాధవరం కృష్ణారావుకు మద్దతుగా నిరసనకు బయలుదేరిన 13 మంది బీఆర్ఎస్ నాయకులను బాలానగర్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కౌశిక్‌రెడ్డి, గాంధీ సంయమనం పాటించాలి: ఎమ్మెల్యే కృష్ణారావు



హైదర్‌నగర్: ఎమ్మెల్యేలుగా ఉన్న కౌశిక్‌రెడ్డి, ఆరెకపూడి గాంధీ ఇద్దరూ సంయమనంతో వ్యవహరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పోలీసులు ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ఉండి హౌస్ అరెస్టులు చేయడం మంచి సాంప్రదాయం కాదన్నారు. ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌ను ఒకరినొకరు రెచ్చగొట్టుకునే వ్యాఖ్యలతో నాశనం చేస్తున్నారన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ ఏర్పడిన నాటి నుంచి ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు వెళ్తే ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం సబబు కాదన్నారు. ఇలాంటి అలజడులు సృష్టిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. హైదరాబాద్‌లో ప్రజలందరూ తెలంగాణ ప్రజలే అని వారిని కాపాడాల్సిన బాధ్యత అధికార పక్షం మీద ఉందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, సతీష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, శిరీషబాబురావు, మందాడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అంధకారంలో బాలాజీనగర్ కాలనీ

నిర్లక్ష్యపు చీకట్లు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి సర్కిల్ బాలాజీనగర్ కాలనీలోని దుస్థితి ఇది. దాదాపు 20 రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. విద్యుత్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేస్తే వీధిలైట్ల నిర్వహణ బాధ్యత తమది కాదని, జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేయాలని అన్నారు. నంబర్ చెప్పండి సార్.. అని ఫిర్యాదుదారులు అడిగితే తెలియదని ఫోన్ పెట్టేశారు. ఎలాగోలా నంబర్ (040-21111111) తెలుసుకుని జీహెచ్ఎంసీకి ఫోన్ చేస్తే వివరాలు అడిగి.. వెంటనే తమ సిబ్బందిని పంపుతామన్నారు. కానీ, 20 రోజులవుతున్నా ఇప్పటికీ బాలాజీనగర్‌లో చీకట్లు తొలగిపోలేదు. ఫలితంగా ఆ ప్రాంతంలోని ఓ ఇంట్లో ఇటీవలే దొంగతనం జరిగింది. దీంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వీధి లైట్లు వెలిగేలా చేయాలని కోరుతున్నారు.

గొప్ప కళాకారులను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత మనది

● విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్


చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్

బంజారాహిల్స్, సెప్టెంబర్13 (ఆంధ్రజ్యోతి): ఎంతోమంది గొప్ప కళాకారులను ప్రపంచానికి పరిచయం చేసిన దేశం మనదని హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఆర్ట్ షోను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ మనుషులతో పోలిస్తే ఆర్టిస్టుల దృష్టి వేరే రకంగా ఉంటుందని ఎంతో కళాత్మకంగా వాళ్లు ప్రపంచాన్ని చూస్తారన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కళాకారులను ఈ దేశం ప్రపంచానికి అందించిందని గుర్తు చేశారు. ప్రకృతిని ఆర్టిస్టులు మరింత అందంగా ఇక్కడ తీర్చిదిద్దిన తీరు నన్ను బాగా ఆకట్టుకుందన్నారు. నిర్వాహకులు క్యూరేటర్ స్టాలిన్ మాట్లాడుతూ ఈ నెల 17 వరకు ఈ ఆర్ట్ షో కొనసాగుతుందని ఈ షోలో వివిధ దేశాలకు చెందిన ఆర్టిస్టులు 150 మందికి పైగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డాక్టర్ అమిత్ సాదుఖాన్, క్యూరేటర్లు శంకర్, అశోక్ మచ్చ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ అంటూ మోసం

యూసుఫ్‌గూడ: ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ నుంచి ఫోన్ చేస్తున్నామని మాట్లాడుతూనే నగదు మాయం చేసిన సంఘటనపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రహ్మత్‌నగర్‌లో నివాసం ఉంటున్న కె.రఘుసూర్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు. ఈ నెల 2వ తేదీ ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ పేరుతో ఫోన్ వచ్చింది. ఆ ఫోన్ మాట్లాడుతుండగా తన క్రెడిట్ కార్డు నుంచి రూ.92,031 రూపాయలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే ఈ ట్రాన్‌జక్షన్ మీదయితే 1 నొక్కండి, లేదంటే 2 నొక్కండి అని మెసేజ్ వచ్చింది. వెంటనే 2 నొక్కాడు. తరువాత రూ.5 వేలు ట్రాన్‌జక్షన్ క్యాన్సిల్ అయిందని మెసేజ్ వచ్చింది. దీంతో రఘుసూర్య సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు


సుందరయ్య భవన్‌లో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిజాంపేట్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ సుందరయ్య భవన్‌లో కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి స్మారకసభను సీపీఎం బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నాయకులు వెంకటరామయ్య ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

షాపూర్‌నగర్: కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్ పార్టీ కార్యాలయంలో సీపీఎం ఏచూరి మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దేవదానం, స్వాతి, కె. శ్రీనివాస్, టీవీఎస్. రమణ, జి.వెంకన్న, సైదులు, మైసయ్య, మల్లారెడ్డి, శ్రీశైలం, బాషా, కరుణాకర్, యదవరెడ్డి, కార్యకర్తలు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


జగద్గిరిగుట్టలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సంతాపం ప్రకటిస్తున్న సీపీఐ నాయకులు ఉమామహేష్, ఇతరులు

● కేపీహెచ్‌బీకాలని: సీతారాం ఏచూరి చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు శుక్రవారం కేపీహెచ్‌బీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రాయదుర్గం: గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం జాతీయ కార్యదర్శి, ఉత్తమ పార్లమెంట్ అవార్డు గ్రహీత సీతారాం ఏచూరి సంతాప సభను అనిల్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు సభ్యులు ఆర్.సాంబశివరావుతో కలిసి ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

గణనాథుడికి ఎంపీ పూజలు


ఫతేనగర్ గౌతమీనగర్‌లోని గణేశ్ మండపంలో బండి రమేష్, లక్ష్మయ్య తదితరులు

గచ్చిబౌలి, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మసీద్‌బండ కొండాపూర్ శ్రీకృష్ణయూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జనా కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ రవికుమార్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వీరిని ఘనంగా సత్కరించారు.


నిజాంపేట్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహం వద్ద కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులు


పూజల్లో ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్


ఆదర్శనగర్‌లో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ రంగారెడ్డి డివిజన్ అధ్యక్షుడు ఏ.శంకరయ్య, కాలనీవాసులు


ఫతేనగర్‌లో పూజలు నిర్వహించిన కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, నిర్వాహకులు

నిమజ్జనానికి చెరువులు రెడీ

చెరువుల వద్ద 24 గంటలూ అధికారులు ఉండేలా ఏర్పాట్లు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో వినాయక నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో నాలుగు చెరువుల వద్ద క్రేన్‌లను ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ (రంగదాముని చెరువు), అల్లాపూర్ సున్నం చెరువు, ప్రగతినగర్ అంబీర్ చెరువు, హస్మత్‌పేట్ బోయిన్ చెరువు ప్రాంతాల్లో ఇప్పటికే నిమజ్జనాలు షురూ అయ్యాయి. బేబీ పాండ్‌లు, చెరువుల వద్ద క్రేన్‌లు రెడీగా ఉంచారు. ఈనెల 17న మహా నిమజ్జనం సందర్భంగా ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ్ చౌహాన్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఇన్‌చార్జిల నియామకం

కూకట్‌పల్లిలోని ఐడీఎల్ ట్యాంక్ చెరువు వద్ద 7 క్రేన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు జీహెచ్ఎంసీ ఈఈ వనమల శ్రీనివాస్ (9849906745)ను లేక్ ఇన్‌చార్జిగా నియమించారు. అల్లాపూర్‌లోని సున్నంచెరువు వద్ద 1 క్రేన్ ఏర్పాటు చేసి ఏఎంహెచ్‌వో డా.కార్తీక్‌ను లేక్‌ఇన్‌చార్జి (9154295227)గా నియమించారు. ప్రగతినగర్‌లోని అంబీర్‌చెరువు వద్ద 2 క్రేన్‌లు ఏర్పాటు చేసి రాజీవ్ (79950 09083)ను లేక్ ఇన్‌చార్జిగా నియమించారు. హస్మత్‌పేటలోని బోయిన్‌చెరువు వద్ద 2 క్రేన్‌లను ఏర్పాటు చేసి రషీద్‌ను లేక్ ఇన్‌చార్జి (79950 09126)గా నియమించారు.

ఏర్పాట్లు చేశాం

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ ఆదేశాలకు అనుగుణంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ జాగ్రత్తలు తీసుకున్నామని కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ డీసీలు కృష్ణయ్య, రమేష్ తెలిపారు.


రోడ్డు కుంగడంతో ఏర్పడిన గుంతను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

మదీనగూడలో కుంగిన రోడ్డు

అప్రమత్తమైన స్థానికులు.. తప్పిన ముప్పు

మియాపూర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): చందానగర్ సర్కిల్-21 పరిధిలో చందానగర్ డివిజన్ మదీనగూడ దీప్తిశ్రీనగర్ నుంచి శాంతినగర్ వెళ్లే మలుపు వద్ద రోడ్డు కుంగి భారీ గుంత ఏర్పడింది. నిత్యం వేలాది మంది తిరిగే ప్రాంతంలో గోతి ఏర్పడడంతో వాహహనదారులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉన్నట్టుండి రోడ్డు కుంగడంతో భారీ గుంత ఏర్పడింది. దీంతో సమారు మూడు మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతులో గుంత ఏర్పడింది. వెంటనే అప్రమత్తమై అధికారుల దృష్టికి తీసుకురావడంతో పెద్దప్రమాదం తప్పింది. రోడ్డును ఆనుకుని ఉన్న ఓపెన్‌నాలా నుంచి నీరు డ్రైనేజీ పైపులైనులో నుంచి రోడ్డు మధ్యకు రావడంతో ఉన్నటుండి కింద రోడ్డు కోతకు గురైనట్లు తెలుస్తుంది. కాగా సీవరేజి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణలు పాటించక పోవడం వల్లనే రోడ్డు కుంగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలిస్తున్నారు.


చీరలను పరిశీలిస్తున్న సుధాజైన్

చేనేత కార్మికుల నైపుణ్యం అద్భుతం

సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో

మియాపూర్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ఒక ప్రదర్శన కంటే కళారూపాలను సంరక్షించడానికి తమ జీవితాలను అంకితం చేసిన కళాకారుల కృషి, నైపుణ్యాన్ని గౌరవించే వేదికని రాచకొండ కమిషనరేట్ ఉమెన్ సేఫ్టీ వింగ్ (షీటీమ్స్) ఇంటర్నేషనల్ పొలిటికల్ సైకాలజిస్ట్ డాక్టర్ సుధాజైన్ అన్నారు. హైటెక్‌సిటీలోని శిల్పకళావేదికలో ఏర్పాటు చేసిన సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో-2024ను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాజైన్ మాట్లాడుతూ.. చేనేత కార్మికుల అసమానమైన నైపుణ్యాన్ని ఒకేచోట చేర్చిన ఈ వేడుకల్లో తాను భాగమైనందుకు గౌరవంగా భావిస్తున్నానన్నారు. ముఖ్యంగా చేనేత రంగం ఒక పరిశ్రమ మాత్రమే కాదని, దేశ విభిన్న సంప్రదాయాలకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జితేందర్‌త్యాగి, సోమనాథ్‌బౌమిక్ మాట్లాడుతూ ఈనెల 16 వరకు ఎక్స్‌పో కొనసాగుతుందని తెలిపారు. అన్ని రకాల చీరలు, డ్రెస్ మెటీరియల్, చందేరి మొదలైనవి అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం


తనీష్‌వర్మ

మియాపూర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ గోకుల్‌ప్లాట్స్‌కు చెందిన తనీష్‌వర్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అంతటా వెతికారు అతడి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా తనీష్‌వర్మ చార్మినార్ పరిసర ప్రాంతాల్లో కనిపించినట్లుగా సమాచారం. ఎవరికైనా తనీష్‌వర్మ కనిపిస్తే 93818 67314, 91761 69718లలో సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం



చందానగర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చందానగర్ మెయిన్‌రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ఖైరతాబాద్: లక్డీకాపూల్‌లోని ఐఎంసీ కళాశాల జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ముంపునకు గురైన మణుగూరులో 300 వరద బాధిత కుటుంబాలకు నాలుగు లక్షల విలువగల 300 నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లలో బియ్యం, కందిపప్పు, చక్కర, రవ్వ, మందులు 15 రకాల సరుకులు ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ చైర్మన్ కె.రఘువీర్ తెలిపారు.